

పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయండి

- కలెక్టర్ సృజన

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నది పరివాహక ప్రాంతాల్లో ముంపులో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. గురువారం ఆమె టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆర్‌డిఒ, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు సహా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో మొదలైందని, లోతట్టు ప్రాంతాలు, ముంపుకు గురవుతున్న ప్రాంతాల్లో పర్యటించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంటే డివిజనల్ లెవెల్ అధికారులు తన దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత మండలాల్లో వర్ష ప్రభావం ఎలా ఉందని అందుకు తగిన చర్యలు ఏ విధంగా తీసుకుంటున్నారని అధికారులను ఆరా తీశారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు పరిస్థితి బాగుందని మంత్రాలయంలో బుధవారం రాత్రి వర్షం ఎక్కువ కురిసిందని తెలిపారు. తహశీల్దార్లను విఆర్‌ఒలను అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశామని, ఎక్కడైనా పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంటే అందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కర్నూలు ఆర్‌డిఒ హరిప్రసాద్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు తహశీల్దార్లను వీఆర్వోలను అప్రమత్తంగా ఉంచుతున్నామని, నదులు వంకలు వాగులలో వరద నీటి ప్రవాహం ఉన్నచోట ప్రజలు వాటిని దాటి వెళ్లకుండా విఆర్‌ఒలను అక్కడ పెట్టామని తెలిపారు. పత్తికొండ ఆర్‌డిఒ మోహన్ దాస్ మాట్లాడుతూ కర్ణాటకలో వర్షాలు పడితే వేదవతి నదికి వస్తాయని ప్రస్తుతానికి కర్ణాటక నుండి ఎటువంటి వాటర్ ఫ్లో లేదని, వర్షాలు ఎక్కువ పడితే ఆలూరు మండలంలో ఉన్న కల్లేవంక పారుతుందని ఆ ప్రాంతం దగ్గరికి తహశీల్దార్ వెళ్లి అధిక వర్షాలు పడి వంక పారినట్లయితే ప్రజలు ఎవరు వాటిని దాటకుండా దండోరా వేయించారన్నారు. తుంగభద్ర జలాశయానికి ఇన్ ఫ్లో మొదలైందని పరిసరాల్లో ఉన్న లోతట్టు ప్రాంతాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో నగరపాలక కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు, మేయర్

విదేశీ విద్యా దీవెనకు రూ.15.55 లక్షలు

జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా విదేశాల్లో చదువుకునే అవకాశం కల్పించిందని, జిల్లాలో ఇద్దరు విద్యార్థులకు రూ. 15.55లక్షల చెక్కు అందజేశామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుండి జగనన్న విదేశీ విద్యా దీవెన రెండవ విడత ఆర్థిక సాయాన్ని సీఎం విడుదల చేశారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్, నగర మేయర్ బివై.రామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హాఫీజ్ ఖాన్, డాక్టర్ సుధాకర్, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, డిసిఎంఎస్ ఛైర్మన్ సిహెచ్.శిరోమణి మద్దయ్య, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... విదేశాలలోని ఉత్తమ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గరిష్టంగా రూ.1.25 కోట్ల వరకు మిగిలిన వారికి గరిష్టంగా రూ.1 కోటి వరకు వంద శాతం ట్యూషన్ ఫీజు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. 100 నుంచి 200 ర్యాంకులు పొందిన యూనివర్శిటీలలో ఎంపికైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు 100 శాతం ట్యూషన్ ఫీజు గరిష్టంగా రూ.75 లక్షల వరకు ఇక మిగిలిన విద్యార్థులకు గరిష్టంగా రూ.50 లక్షలు లేదా ట్యూషన్ ఫీజులో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్నారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులు వారు ఎంచుకున్న కోర్సు పూర్తి చేసుకునేలా 4 వాయిదాల్లో స్కాలర్‌షిప్స్ మంజూరు చేస్తున్నామన్నారు. అనంతరం జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా రెండవ విడత ఆర్థిక సాయం పొందిన ఇద్దరు విద్యార్థులకు (బిసి(బి)-1, మైనారిటీ-1) రూ.15.55లక్షల మెగా చెక్కును అందజేశారు. సాంఘిక సంక్షేమ శాఖ జెడి రంగాలక్ష్మి దేవి, బిసి సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నీటి కుంటల్లా రోడ్లు...

- చిన్నపాటి వర్షానికే బురదమయం - వాహనదారులకు తీవ్ర అవస్థలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/విలేకరులు

చిన్నపాటి వర్షం వచ్చిందంటే చాలు గ్రామీణ రోడ్లన్నీ కుంటల్లా మారిపోతున్నాయి. చాలా రోడ్లు కంకర, మట్టి తేలడంతో చినుకు పడగానే చిత్తడిగా మారిపోతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు...

మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి గ్రామీణ రహదారులు బురదమయంగా మారిపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ గ్రామీణ ప్రాంతాల రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. రహదారిపై నీరు చేరడంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు రోజుల తరబడి నిలబడడంతో దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు వ్యాప్తి చెంది రాత్రి పూట కంటిమీద కునుకు ఉండడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి రహదారులపై మురికి నీరు నిలువ లేకుండా చేయాలని కోరుతున్నారు. పలు ప్రాంతాల్లో రహదారి అడుగు కో గుంతతో వాహనదారులకు దర్శనమిస్తోంది. మండలంలో గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ గుంతలలో నీరు చేరి రహదారులు వాహనదారులకు చెరువుల వలే దర్శనమిస్తూ అటుగా వచ్చే వాహనదారులకు అగచాట్లకు గురి చేస్తున్నాయి. వాహనాలు ఈ గుంతలలో ఇరుక్కొని వాహనాలు రిపేర్లు వచ్చిన పరిస్థితులు కూడా చాలా ఉన్నాయి. **చిప్పగిరి** మండలంలో చాలా గ్రామాల రోడ్లు వర్షానికి అధ్వానంగా తయారయ్యాయి. వాహనదారులు, ప్రజలు ఆ రోడ్లల్లో వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రామదుర్గం బస్సు స్టేజి నుంచి గ్రామంలోకి వెళ్లే అడ్డ రోడ్డు, నేమకల్లు బస్ స్టేజి నుంచి నేమకల్లు గ్రామంలోకి వెళ్లే రోడ్లు, తిమ్మాపురం గ్రామంలోకి వెళ్లే అడ్డరోడ్ల పరిస్థితి దయనీయంగా ఉంది. **ఆలూరు** ప్రధాన రహదారిలో పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలు పడి దర్శనమిస్తున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముందు రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది. **పెద్దకడుబూరు** మండలంలోనూ రోడ్ల పరిస్థితి అదే విధంగా ఉంది. కల్లుకుంట గ్రామం బస్టాండ్ రోడ్డు బురదమయంగా మారింది. పెద్దకడబూరు, చిన్న తుంబలం, మేకడోన ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. సి.బెళగల్ మండల కేంద్రంలో బస్టాండ్ ముందు రోడ్డు గుంతలు పడి దర్శనమిస్తోంది. కర్నూలు నగరం నుంచి గార్గేయపురం వెళ్లే అమరావతి రోడ్డు బురదమయంగా మారింది. **కౌతాళం** మండలంలో పలు గ్రామాల రహదారులు అధ్వానంగా మారాయి. హాల్వి నుంచి ఉరుకుంద, కౌతాళం నుంచి బదినేహాల్, ఎరిగిరి నుంచి ఉరుకుందకు వెళ్లే రహదారులు గుంతలు పడ్డాయి. ఆ దారుల్లో ప్రయాణానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



ఆలూరు ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం ముందు గుంతలు పడిన రోడ్డు



కౌతాళం మండలం హాల్వి నుంచి వారుకుంద వెళ్లే రోడ్డు దుస్థితి

ప్రాజెక్టులకు వరద

- తుంగభద్ర, శ్రీశైలంకు కొనసాగుతున్న నీటి ప్రవాహం

ప్రజాశక్తి-హోళగుంద

కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ, చిత్రదుర్గ, బెళగావి, చిక్కమంగళూరు, తదితర ప్రాంతాల్లో గతవారం రోజులుగా అధిక వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర డ్యాంకు వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం 1,11,566 క్యూసెక్కుల నీరు తుంగభద్రలోకి వచ్చి చేరుతోంది. జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 105.788 టిఎంసిలు కాగా ప్రస్తుతం 49.76 టిఎంసిలుగా ఉంది. జలాశయ గరిష్ట నీటి మట్టం 1633 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 1615.56గా ఉంది. గత రెండు నెలలుగా వర్షాలు లేక డ్యాంకు వరద నీరు రాకపోవడంతో ఈ ఏడాది ఎల్ఎల్‌సి కాల్వ కింద సాగు ప్రశ్నార్థకమే అనుకున్న అన్నదాతలకు ప్రస్తుతం తుంగభద్ర డాం వరద నీరు వచ్చి చేరతుండడంతో అన్నదాతలు ఆనందంలో మునిగి తేలుతున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు : కృష్ణానది పరివాహక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం ప్రారంభమైనది. గురువారం మూడు గంటల సమయానికి ఎగువ జూరాల నుండి 70,422 క్యూసెక్కులు, హంద్రీ నుండి 1,125 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతున్నాయి. అదే సమయానికి జలాశయం నీటి మట్టం 817.70 అడుగులుగా, నీటి నిలువ సామర్థ్యం 39.2025 టిఎంసిలుగా నమోదయింది. రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలోని జల విద్యుత్ కేంద్రాలల్లో విద్యుత్ ఉత్పత్తి చేయడం లేదు.

నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం

- డిఇఒ రంగారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో భాగంగా నాణ్యమైన విద్యాబోధన అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట రంగారెడ్డి వెల్లడించారు. గురువారం కర్నూలు కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానం- 2020 ప్రకారం విద్యా బోధన అందిస్తున్నామన్నారు. పిపి వన్, పిపిటు , ఫౌండేషన్ స్కూల్స్ లాంటి చర్యలు ఈ విద్యా విధానం అమల్లో భాగంగానే చేపట్టామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబులను అందజేశామన్నారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తూ ప్రస్తుత అంశాలకు అనుగుణంగా విద్యా బోధన చేపడుతున్నామన్నారు. నూతన విద్యా విధానాన్ని అమలు చేసే రాష్ట్రంలో మన రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. కేంద్రీయ విద్యాలయ ఇన్చార్జి ప్రిన్సిపల్ ఆంజనేయులు మాట్లాడుతూ తమ విద్యా సంస్థలో ఎన్‌సిపి-2020 ప్రకారం అమలు చేస్తున్నామన్నారు. బల్వాటిక పరిచయం కింద ప్రత్యేక శిక్షణా తరగతులను ప్రారంభించామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వృత్తి పరమైన సబ్జెక్టును కూడా ప్రవేశపెట్టామన్నారు. ఉపాధ్యాయులకు అనేక అంశాలపై శిక్షణ తరగతులను కూడా ఇస్తున్నామన్నారు. విద్యార్థులు కార్యక్రమంలో విద్యార్థులను మరింత అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాదు నుంచి వచ్చిన ప్రిన్సిపల్ ఇజ్రాయిల్ కల్లూరు మండల విద్యాశాఖ అధికారి వనజ కుమారి పాల్గొన్నారు.

గోడ ప్రమాదంపై విచారణ జరిపించాలి

- బాధితులకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలి
- బాధితులను పరామర్శించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా కేంద్రంలో మునిసిపల్ అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నిర్మిస్తున్న నాణ్యతలేని టాయిలెట్ల వల్ల కార్మికుల ప్రాణాలకు భద్రత లేకుండా పోతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయి విమర్శించారు. రాజ్ విహార్ నుండి బస్టాండ్ వైపు వచ్చే దారిలో కర్నూలియన్ బోర్డు వద్ద మెడికల్ కళాశాల హాస్టల్‌కు ఆనుకుని నిర్మిస్తున్న నూతన టాయిలెట్ల నిర్మాణం గోడ కూలి ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని గురువారం సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి నాయకత్వంతో సందర్శించారు. ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గౌస్‌దేశాయి మాట్లాడుతూ నగర సుందరీకరణ పేరుతో ఉన్నవి పీకి కొత్తవి కడుతూ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కాంట్రాక్టర్లతో కుమ్మక్కై లూటీ చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఎంతోమంది ప్రయాణికులకు కూర్చోవడానికి అవకాశం ఉన్న ఫుట్‌పాత్ బస్‌స్టాపులను కూల్చేసారన్నారు. ఉన్న ఫుట్‌పాత్‌లను పీకి కొత్త ఫుట్‌పాత్‌లను వేస్తున్నారన్నారు. విజయవాడ, అనంతపురం, కడప నుండి కర్నూలుకు వచ్చే ప్రయాణికులు బస్సు దిగే మెడికల్ కళాశాల హాస్టల్ గోడకు ఆనుకుని ఉన్న బస్‌స్టాప్‌ను తొలగించి అక్కడ టాయిలెట్‌ను నిర్మిస్తున్నారన్నారు. అది సరిపోక కర్నూలియన్ బోర్డు దగ్గరలో మరో టాయిలెట్‌ను వరుసలో నిర్మించి మెడికల్ కళాశాల గోడకు ఈ వరుసకు మధ్య మట్టితో నింపారన్నారు. వర్షం వల్ల మట్టి లోపలికి కంగిపోయి నాణ్యతలేని సిమెంట్ వాడిన కారణంగా గోడ కూలి ఏడుగురు కార్మికులు ప్రమాదానికి గురయ్యారన్నారు. ఒకవైపు జిల్లా కలెక్టర్ తీవ్ర వర్షాభావం వల్ల స్కూళ్లకు సైతం సెలవు ప్రకటిస్తే, మరోవైపు వర్షంలోనే నాణ్యతలేని పనులను కొనసాగించడం వల్ల కార్మికులు బలి పశువులయ్యారన్నారు. సుబ్రహ్మణ్యం అనే కార్మికుడికి చేతులు కాళ్లతో పాటు అనేక చోట్ల ఫ్రాక్చర్లు కాగా అముకుతాడు నుండి వచ్చిన రోజువారి కూలీ షేక్షావలికి కాలు ఫ్రాక్చర్ అయిందన్నారు. అంజి, ఎటిఎం, రాము తోపాటు మరో కూలీ గాయాలతో హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యారన్నారు. పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాల నుండి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పనికి వచ్చిన కూలీలను నాణ్యతలేని పనులకు ఉపయోగించిన కాంట్రాక్టర్, అధికారులు వాళ్ళని ప్రమాదంలోకి నెట్టివేశారన్నారు. తీవ్ర గాయాలైన వారికి లక్ష, మిగిలిన వారికి రూ.25,000 నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉదయం 9 గంటలకు ప్రమాదం జరిగితే అధికారి ,కాంట్రాక్టర్ ఒక్కరుకూడా పని దగ్గర లేరన్నారు. ఎంతటి బాధ్యతారహితంగా ఉన్నారో అర్థం చేసుకోవాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకష్ణ, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నాయకులు షరీఫ్, కెవిపిఎస్, ఆర్‌విఎస్, కెజి బిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎండి. ఆనంద్ బాబు, సి.గురు శేఖర్, ఎన్‌జి.కృష్ణ, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడు సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వారిలో ఉన్నారు.




గోడ కూలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్



కర్నూలు మండలం ఈ.తాండ్రపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ ప్రారంభించారు. స్థానిక వైసిపి నాయకులు, మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్స్ ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపనే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ సచివాలయం వ్యవస్థ, గ్రామ వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి వివక్షతకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా అర్హులైన పేద ప్రజలు, రైతన్నలు, వృద్ధులు, విద్యార్థులు, కుల వృత్తులు వారు, ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు అన్ని వర్గాల ప్రజల, అన్ని ప్రాంతాల అభివృద్ధే తన అభిమతం గాముందుకుసాగుతున్నారని అన్నారు. ఎంపిపి వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపి నెహెమ్యా, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, ఇ.తాండ్రపాడు సర్పంచి బాలపీరా, కన్వీనర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మణిపూర్ ఘటనపై కవయిత్రుల కన్నెర్ర

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

మణిపూర్ దారుణ కృత్యాన్ని వ్యతిరేకిస్తూ నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం కర్నూలు శాఖ తీవ్ర నిరసన తెలిపింది. గురువారం కావెం సుబ్బలక్ష్మీ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. కార్యదర్శులు పసుపులేటి నీలిమ, శీతామహాలక్ష్మి, డాక్టర్ దండెబోయిన పార్వతిదేవి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇది భారత జాతి తీవ్రంగా అవమాన పడ్డ సంఘటనగా మొత్తంగా కవయిత్రులందరూ తమ కవనం ద్వారా కన్నెర్ర చేశారు. ఏసంఘటన జరిగినా ఆధిపత్యపు పోరులో వర్ణ, వర్గ , జాతి, మత వివక్ష సంఘర్షణ ఏర్పడిన ప్రతిసారి మహిళలవైపు, బలహీనుల వైపు వెళ్లడం , వారిని అమానుషంగా బాధించడం, మానాభిమానాలను కూడా పరిగణించకుండా నిస్సిగ్గుగా ప్రవర్తించడం చరిత్రలో చూస్తున్నామన్నారు. ఇది పునరావృతం కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు , పాలకవర్గం తప్పక జాగ్రత్త తీసుకోవాలని సదస్సు అభిప్రాయ పడింది. మహిళలకు రక్షణ ఇచ్చే పాలకులు కావాలని కోరారు. కుకీలకు, మైతీలకు ఏర్పడిన ఈ సంఘర్షణ పట్ల ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేక పోయిందని ప్రశ్నించారు. దీనికి పాలకులు బాధ్యత వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్త మహిళలు, మహిళా సాహితీసంస్థలు, ఈ సభలో తమగళాన్ని వినిపించారు. సునీత, రత్నలక్ష్మి, లీలావతి, జ్యోత్స్న, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

కరోనాలో సేవ చేశామని చెప్పే ధైర్యం మీకుందా?



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ఆ సమయంలో మీరు మీ నాయకులు ఎక్కడ?
కర్నూలు టిడిపి ఇన్చార్జి టీజీ భరత్ పై హాఫీజ్ ఖాన్ విసుర్లు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కరోనా సమయంలో వ్యక్తిగత ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా ధైర్యంగా ప్రజల్లో సేవలు అందించామని చెప్పుకునే ధైర్యం నాకు ఉందని అది మీకుందా అని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హాఫీజ్ ఖాన్ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి టిజి.భరత్ గురించి మాట్లాడారు. శుక్రవారం కర్నూల్ నగరంలో వివిధ వార్డుల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయా వార్డుల సచివాలయాల పరిధిలో కార్యక్రమం నిర్వహించారు. హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో టిడిపి నాయకులు కొందరు అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. స్వచ్ఛమైన పూర్తికాలపు రాజకీయాలు బాధ్యతగా చేపడుతున్న తనపై కొంతమంది వ్యాపారం చేస్తూ రాజకీయాలు నడిపే వారు తనపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏనాడూ ప్రజల చెంతకురాని వారు నేడు ప్రజలపై ఎక్కడలేని ప్రేమను వలకబోస్తున్నారన్నారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో తాము సేవ చేస్తున్నామని ప్రజలకు తెలియజే సేందుకు నానా అవస్థలు పడుతున్నారన్నారు. కరోనా వంటి ఆపత్కాల సమయంలో ప్రజలకు సేవలు అందించడానికి ప్రాణాలను లెక్కచేయకుండా పని చేశామని అన్నారు. అప్పుడు మీ నాయకుడు చంద్రబాబు మీరు ఎక్కడ దాగున్నారని ప్రశ్నించారు. తండ్రి కొడుకులు చిన్నయ్య పెద్దయ్య ఆడుతున్న రాజకీయ నాటకాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలిసని అన్నారు. ఇప్పుడు మా భవిష్యత్తు గ్యారెంటీ మీ భవిష్యత్తు గ్యారంటీ అనే నినాదాలతో ప్రజల్లో వస్తున్న వారికి బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే అన్నారు.


మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి

ప్రజాశక్తి-గూడూరు

మణిపూర్ ఘటనకు నిరసనగా గూడూరులో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో గురువారం శాంతి ర్యాలీనిర్వహింబచారు. సిబిసి చర్చ్ క్రీస్తు సంఘం ప్రేమ పవర్ సంఘాలు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. క్రైస్తవ సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ పాస్టర్ రేవసిహెచ్ చిన్న రాజు, ప్రేయర్ పవర్ చర్చి మేరీ సిస్టర్ మాట్లాడుతూ భారతదేశంలో మతపరమైన హింసలు అత్యాచారాలు ఈ మధ్యకాలంలో ఎక్కువ అయ్యాయన్నారు. మణిపూర్ సంఘటనకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనలో 509చర్చిలను ధ్వంసం చేసి 134 మందిని చంపి స్త్రీలను నగ్నంగా ఊరేగిస్తూ నీచ సంస్కతిని ప్రతి ఒక్కరూ ఖండించి అక్కడ శాంతిని కాపాడే విధంగా కేంద్ర ప్రభుత్వం ఖచ్చితమైన ఆదేశాలతో అణచి వేయాలన్నారు. చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, జిల్లా దళిత జెఎసిసామాజిక ఉద్యమ నాయకులు వి సుభాకర్, సిఐటియు డివిజన్ కార్యదర్శి జె. మోహన్ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గూడూరులో క్రైస్తవ , ప్రజాసంఘాల నిరసన ప్రదర్శన





పోటీలను ప్రారంభిస్తున్న టిజి.భరత్

స్పోర్ట్స్ సిటీగా కర్నూలు : టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్ : క్రీడల కొరకు కావలిసిన సహాయ సహకారాలు అందిస్తూ కర్నూలును స్పోర్ట్స్ సిటీగా రూపొందించడం కోసం అహర్నిశలు పాటుపడతామని కర్నూల్ టిడిపి అసెంబ్లీ ఇంచార్జ్ టిజి.భరత్ అన్నారు. గురువారం కర్నూలులోని కిడ్స్ వరల్డ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఇన్విటేషన్ టైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. టిజి. భరత్ మాట్లాడుతూ క్రీడాకారుల సంక్షేమానికి నిరంతరం ముందు ఉంటామన్నారు. విద్యార్థి దశ నుంచే మార్షల్ ఆర్ట్స్ వంటి యుద్ధ క్రీడల్లో సాధన చేస్తే క్రమశిక్షణతో పాటు వాటి ద్వారా వచ్చే ప్రశంస పత్రాలు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు దోహదపడతాయన్నారు.జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, టైక్వాండ సంఘం జిల్లా కార్యదర్శి శోభన్ బాబు లు మాట్లాడారు.జిల్లా ఒలంపిక్ సంఘం కాని కార్య నిర్వాహక కార్యదర్శి పి . సునీల్ కుమార్,యూఆర్బి ఫౌండేషన్ అధ్యక్షులు ఊట్ల రమేష్ బాబు, న్యాయవాది శ్రీధర్,పోటీల నిర్వాహకులు సతీష్, వీరేష్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

విద్యుత్ జెఎసి ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం గురువారం విద్యుత్ సౌధ ముందు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. విద్యుత్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ నిరసన కార్యక్రమాన్ని చేస్తున్నట్లు జెఎసి నాయకులు తెలిపారు.

యశోద హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- మరిన్ని సేవలు అందిస్తాం - డాక్టర్ షణ్ముఖ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్



పేద ప్రజలకు మరిన్ని ఉచిత వైద్య సేవలు అందిస్తామని డాక్టర్ షణ్ముఖ అన్నారు. గురు వారం దక్షిణ షిరిడీగా పిలువబడే పాతబస్తీలోని సాయిబాబా దేవాలయంలో, ఆలయ పాలక మండలి సహకారంతో హైదరాబాద్ సోమాజి గూడ యశోద హాస్పటల్స్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ ఆఫ్ ఎమర్జెన్సీ సర్వీసెస్ డాక్టర్ షణ్ముఖ రోగులను పరీక్షించి, బిపి, షుగర్, పల్స్, ఇసిజి, 2-డి ఎకో పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. 2 డిఎకో పరీక్షలు టెక్నీషియన్ అంజి, ఇసిజి పరీక్షలు టెక్నీషియన్ జాస్మిన్ నిర్వహించారు. క్యాంప్ కో ఆర్డినేటర్లు రమణ, గణేష్, రాజ మహేశ్వర రెడ్డి లు రోగులకు సహకరించారు. వైద్య శిబిరానికి 150 మందికి పైగా సద్వినియోగం చేసుకున్నారు. దేవాలయ పాలక మండలి సభ్యులు లక్ష్మీనారాయణ, ఎ.దత్తస్వామి, లయన్ వెంకటేశ్వర్లు, అర్వేటీ జగదీష్, నరసింహాచారిలు మాట్లాడుతూ భక్తులకు ఉచితంగా వైద్య సేవలు అందించిన యశోద హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

వర్షానికి కూలిన మట్టి మిద్దె

ప్రజాశక్తి-సి బెళగల్



మండలంలోని కొత్తకోటలో ఉప్పరి వెంకటేష్ కు చెందిన మట్టి మిద్దె గురువారం వర్షానికి కూలింది. పాత మిద్దె కావడంతో కుటుంబికులు అప్రమత్తం అయ్యాక కూలీపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే ఇంట్లో వంట, వస్తూ సామాగ్రి,ఆహార నిల్వలు, దుస్తులు వంటివి నష్టం మిగిల్చినట్లు బాధితులు వాపోయారు.



ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ, నాయకులు

వైసిపిపై సమరానికి సిద్ధం

- మాజీ ఎమ్మెల్యే బీవీ - ఘనంగా బీవీ.మోహన్ రెడ్డి వర్ధంతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వైసిపిపై సమరానికి సిద్ధంగా ఉన్నామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సోమప్ప సర్కిల్‌లో మాజీ మంత్రి, కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి వర్ధంతి నిర్వహించారు. బీవీ.మోహన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీవీ మాట్లాడారు. తమ తండ్రి పేరు లేకుండా చేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి కుట్ర చేశారని తెలిపారు. ఎమ్మిగనూరు ప్రజల గుండెల్లో ఆయన ఉంటారని చెప్పారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మోహన్ రెడ్డి పేరును ప్రజల మనసుల నుంచి చెరపలేరన్నారు. ఎమ్మిగనూరు నుంచి వరసగా 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఎన్‌టి.రామారావు, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అనేక పర్యాయాలు మంత్రిగా కొనసాగారని తెలిపారు. రాష్ట్రంలో తిరుగులేని నాయకునిగా ముద్ర వేసుకుని, ఎమ్మిగనూరు నియోజకవర్గానికి రాష్ట్రస్థాయిలో పేరు, ప్రఖ్యాతలు తెచ్చారని అన్నారు. టిడిపి నాయకులు కొండయ్య చౌదరి, రామదాసు గౌడ్, దయాసాగర్, రామకృష్ణ నాయుడు, సుందర్ రాజు, నేసే మల్లికార్జున, పాల్లపల్లి మల్లికార్జున, మధుబాబు, రంగస్వామి గౌడ్, చిన్న రాముడు, గడ్డం నారాయణ రెడ్డి, కాశిమ్ వలీ, గోపాల్, రమేష్ నాయుడు, నజీర్ అహ్మద్, కటారి రాజేంద్ర పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి మండల నాయకులు నజీర్ సాహెబ్, గాజులదిన్నె హనుమంతు, తిరుపతయ్య నాయుడు, కులమాల రాముడు, శ్రీధర్ నాయుడు, రమేష్ నాయుడు, రంగస్వామి నాయుడు, నాయకులు అడ్వకేట్ చంద్ర, వెంకటేశ్వర్లు, మదీన, అచ్చుగట్ల కొత్తింటి ఫక్రుద్దీన్, ఎర్రబాడు శీను, రాంపురం లాలు, చేపల చంద్ర పాల్గొన్నారు.

మెరుగైన సేవలే 'జగనన్న సురక్ష' లక్ష్యం

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే 'జగనన్న సురక్ష' లక్ష్యమని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని 30, 31, 32, 33వ వార్డులకు సంబంధించిన లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనన, మరణ, వివాహ, కుల, ఆదాయ, స్థానిక సర్టిఫికెట్లతో పాటు భూములు, ప్లాట్లు, ఇల్లు రిజిస్ట్రేషన్ సౌకర్యాలు సచివాలయంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, కమిషనర్ గంగిరెడ్డి, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ కొమ్ము రాజశేఖర్, కౌన్సిలర్ బోయ బజారి, వైసిపి నాయకులు బుట్టా రంగయ్య, పాల శ్రీనివాస రెడ్డి, కోటకొండ నరసింహులు, విశ్వనాథ్, వడ్డే వీరేష్ పాల్గొన్నారు.

హమాలీ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - హాలహర్వి

హమాలీ సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. గురువారం గోవిందమ్మ గుడిలో సంఘం మండల నూతన మహాసభ సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి కృష్ణ అధ్యక్షత వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షులు సతారీ ఈరన్న, ఉపాధ్యక్షులు ఎం.గాది లింగప్ప, కార్యదర్శి బసవరాజు, సహాయ కార్యదర్శి రామాంజినప్ప, కోశాధికారి సి.రామాంజనప్ప, సహాయ కోశాధికారి రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ వెంకటరమణ, ఆదామ్, రాముడు, సుబ్బయ్య, భీమలింగ, సతారీ దర్గప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సిఐటియు జిల్లా నాయకులు కెపి.నారాయణస్వామి మాట్లాడారు. ప్రభుత్వం హమాలీలకు పింఛను, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలిపారు.

పండ్ల తోటలతో అభివృద్ధి చెందండి

- ప్లాంటేషన్ డిప్యూటీ కమిషనర్ భవానీ

ప్రజాశక్తి - దేవనకొండ

ఉపాధి హామీ చట్టం కింద రైతులకు రాయితీపై అందిస్తున్న పండ్ల మొక్కలను సద్వినియోగం చేసుకుని పండ్ల తోటలతో అభివృద్ధి చెందాలని ప్లాంటేషన్ డిప్యూటీ కమిషనర్ భవానీ సూచించారు. గురువారం మండలంలోని మాచాపురం గ్రామంలో మోహన్ రెడ్డి, శివారెడ్డి అనే రైతులు ఉపాధి హామీ చట్టం కింద సాగు చేసిన పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలించారు. రైతులు పండ్ల తోటల సాగుతో ఆర్థికంగా ఎదగాలన్నారు. ఏపీడీ పద్మావతి, ఎంపిడిఒ గౌరీదేవి, హార్టికల్చర్ మేనేజర్ నంద కిషోర్, సూపర్‌వైజర్ రత్నం, ఎపిఒ కృష్ణమూర్తి, టెక్నికల్ జెఇ రంగస్వామి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు నారాయణ స్వామి నాయక్, చిన్న గిడ్డయ్య పాల్గొన్నారు.

అంతా అపరిశుభ్రతే..!

- గ్రామాల్లో విజృంభిస్తున్న జ్వరాలు
-మంచం పడుతున్న వృద్ధులు, పిల్లలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని ఆయా గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులు జ్వరాలతో మంచం పడుతున్నారు. మరికొంతమంది పిహెచ్‌సిలకు పరుగులు తీస్తున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మండలంలోని పెద్దతుంబలం, పెద్దహరివాణం, మండిగిరి, చిన్నహరివాణం, సంతేకుడ్లూరు, మదిరె, ఆరెకల్లు, ఇస్వి, హానవాలు, జాలమంచి, పాండవగల్, కుప్పగల్, నాగలాపురం, కపటి తదితర గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే గ్రామంలో అనేకమంది వృద్ధులు, చిన్నపిల్లలు మంచం పట్టారు. మరికొందరు కొద్దిరోజులుగా పెద్దహరివాణం, పెద్దతుంబలం పిహెచ్‌సికి క్యూ కడుతున్నారు. ఇటీవల ఆ గ్రామం నుంచి 20 మందికి పైగా గ్రామస్తులు విష జ్వరాలతో పిహెచ్‌సికి చేరుకున్నారు. దోమల నివారణకు గానుగ స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రతిఒక్కరూ దోమ తెరలు వినియోగించాలని, వేడి నీరు తాగాలని పెద్దహరివాణం పిహెచ్‌సి వైద్యులు అమ్రాన్ సూచించారు.



పెద్దహరివాణం పిహెచ్‌సి సెంటర్

కలుషిత నీరే కారణమా..?

గ్రామాల్లో విష జ్వరాల వ్యాప్తికి కలుషిత నీరే కారణమని తెలిసింది. ప్రస్తుతం జోరుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామస్తులు ఆ నీటిని తాగి జ్వరాల బారిన పడుతున్నారనే వాదనలు లేకపోలేదు. మరోవైపు ఆ ప్రాంతంలో పారిశుధ్యం నిర్వహణ కూడా అంతంతమాత్రంగానే ఉంది. జ్వర బాధితులు పెరుగుతున్నారు. పెద్దహరివాణం, పెద్దతుంబలం పిహెచ్‌సికి చేరుకోవడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. గ్రామంతో పాటు పిహెచ్‌సిలో ఇప్పటివరకు ఆ గ్రామానికి చెందిన 117 మందికి రక్త పరీక్షలు చేశారు. వారిలో 24 మందికి విష జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. జ్వరపీడితులు రోజురోజుకూ పెరుగుతుండడంతో ఆ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి జ్వరాల అదుపునకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఎడమ కాలువలో పారుతున్న నీరు

జిడిపి కాలువలకు నీటి విడుదల

- గేట్ల మరమ్మతుల కోసమే అంటున్నరైతులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలో ఉన్న రెండు కాలువలకు గురువారం నీటిని విడుదల చేశారు. కుడికాలువకు 100 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 100 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. కొద్ది నెలల క్రితం వర్షాభావ పరిస్థితుల్లో పంటలు ఎండుతున్నా నీటిని విడుదల చేయాలని వేడుకున్నా తాగునీటి అవసరాల సాకు చూపి ప్రాజెక్టు అధికారులు నీటిని విడుదల చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాను నేపథ్యంలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో నీరు నిలిచి పంటలు దెబ్బతింటున్నాయి. ప్రస్తుత తరుణంలో అవసరం లేకున్నప్పటికీ కాలువలకు నీటిని విడుదల చేయడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డ్యాంలో ఉన్న 0.75 టిఎంసిల నీటిని ప్రాజెక్టు నూతన గేట్ల ఏర్పాటు కోసమే నీటిని కిందికి వదిలి వృథా చేస్తున్నారని మరి కొంతమంది రైతులు విమర్శిస్తున్నారు.

అవసరం లేకున్నా నీటి విడుదల

- కెవి.కృష్ణారెడ్డి, మాజీ ఎంపిపి



గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలోని కాలువలకు నీటి విడుదల చేసేటప్పుడు ఆయకట్టు రైతులతో చర్చించి విడుదల చేయాలి. కొద్ది నెలల క్రితం తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పంటలు ఎండుతుండగా నీటిని విడుదల చేయాలని రైతులు కోరారు. అప్పుడు అధికారులు నీటిని విడుదల చేయలేదు. కొద్ది రోజులుగా వర్షాలు కురిసి పంటలు దెబ్బతింటున్న తరుణంలో అవసరం లేకున్నా కాలువలకు నీటిని విడుదల చేసి వృథా చేయడం సరికాదు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - కోసిగి

కోసిగిలోని కిరణ్ హైబ్రిడ్స్, కోరమాండల్, వాసవీ ట్రేడర్స్, మంజునాథ ట్రేడర్స్, శ్రీవెంకటేశ్వర ట్రేడర్స్, కిసాన్ మాల్, లక్ష్మి వెంకటేశ్వర ట్రేడర్స్ దుకాణాల్లో గురువారం సీడ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేపట్టారు. విత్తన దుకాణాల్లో రికార్డులను పరిశీలన చేసి తనిఖీ చేశారు. దుకాణాల్లో ఉన్న విత్తనాల నిల్వ వివరాలను, ఎరువులు, పురుగు మందులను పరిశీలించారు. విత్తనాలకు సంబంధించిన బిల్లు బుక్కులను, డెలివరి చలానాలను, మార్కెటింగ్ అగ్రిమెంట్, వచ్చిన స్టాక్, అమ్మిన స్టాక్ వాటి లెక్కలను గమనించారు. ఈ సందర్భంగా ఎడిఎ సంధ్య రాణి మాట్లాడారు. విత్తనాలు అమ్మే డీలర్లకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. కోరమాండల్ దుకాణంలో బిల్ బుక్ మెయింటనెన్స్ చేయకపోవడం వల్ల రూ.6.7 లక్షల విలువ గల విత్తనాలకు స్టాఫ్ సేల్ ఇచ్చినట్లు తెలిపారు. ఎఒ రామకృష్ణ, కోసిగి ఎఒ



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మణిపూర్ ఘటనకు బాధ్యత వహిస్తూ...

మోడీ, షా రాజీనామా చేయాలి

- కాంగ్రెస్ నాయకులు లక్ష్మినారాయణ

ప్రజాశక్తి-ఆలూరు

మణిపూర్ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మినారాయణ డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్, సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహశీల్దార్ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మినారాయణ మాట్లాడారు. ఆదివాసీ కుకి తెగపై రెండు నెలలుగా జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలు, హింసాకాండకు బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం మరోసారి బిజెపి రేపిన మతోన్మాద చిచ్చు మణిపూర్ ఘటన అని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హింసాకాండను నిలువరించక పోగా చోద్యం చూస్తూ బయటి ప్రపంచానికి తెలియకుండా ఇంటర్ నెట్‌ను కట్ చేసి మారణ హోమానికి కారకులయ్యాయని విమర్శించారు. ముగ్గురు కుకీ తెగకు సంబంధించిన మహిళలను పోలీసుల రక్షణ నుంచి లాక్కొని వివస్త్రలను చేసి వీధుల్లో ఊరిగించారని తెలిపారు. వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించి అత్యాచారం చేసిన మానవ మృగాలను అరెస్టు చేసి ఉరి తీయాలని కోరారు. ఆలూరు ఐక్య క్రైస్తవ సంఘం నాయకులు పాస్టర్ ఏసన్న, జాన్ వెస్లీ, విజయ్ కుమార్, శ్యామ్ బాబు, సిపిఎం నాయకులు ఈరన్న, వీరేష్, మైనా, గోవర్ధన్, విఠల్, ఎంఆర్‌పిఎస్ ఆలూరు తాలూకా అధ్యక్షులు కత్తి రామాంజనేయులు, హాలహర్వి మండల అధ్యక్షులు గూళ్యం ఎల్లప్ప, హొళగుంద మండల అధ్యక్షులు వెంకటేష్, ఆలూరు పట్టణ అధ్యక్షులు చంద్ర, గుంతకల్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు అలాం నవాజ్, గాలి మల్లికార్జున, జిలాన్ బాష, చిప్పగిరి మండల అధ్యక్షులు దేగులపాడు మంజునాథ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామాంజనేయులు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఉరుకుందప్ప, ఎస్సీ సెల్ చిప్పగిరి మండల అధ్యక్షులు ఖాజీపురం రాంబాబు, బాపురం వీరేష్, నవీన్, సంజప్ప, మహిళలు పాల్గొన్నారు.



అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న రాజకీయ, ప్రజాసంఘాలు

ప్రజలకు అందని సేవలు

- బదిలీపై వెళ్లిన డిజిటల్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి - ఆస్పరి



సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల వద్దకు సేవలు అందించాలని ప్రభుత్వ ఆశయం ఆస్పరి సచివాలయంలో నీరుగారుతోంది. ఆస్పరి మేజర్ పంచాయతీ పరిధిలో రెండు గ్రామ సచివాలయాలు నిర్మించారు. ఈ రెండు సచివాలయాల్లో ప్రజలకు ఉపయోగపడే డిజిటల్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సచివాలయం-1లో పని చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ అర్షియ బతున్ బదిలీపై దేవనకొండ మండలం కుంకనూరు గ్రామానికి వెళ్లారు. సచివాలయం-2లో పని చేస్తున్న ఇన్‌ఛార్జీ డిజిటల్ అసిస్టెంట్ గజేంద్ర కూడా వెల్దుర్తి మండలానికి బదిలీపై వెళ్లడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ప్రజలకు అందుబాటులో లేని సేవలు

ప్రజలకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, అడంగల్, వన్ బి, మ్యారేజ్ సర్టిఫికెట్, రేషన్ కార్డ్, ఇన్‌కం, క్యాస్ట్, ఆధార్ అప్‌డేట్, నేమ్ కరెక్షన్, ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ లింక్ వంటి సేవలకు ప్రజలు దూరమయ్యారని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

డిజిటల్ అసిస్టెంట్ల పోస్టులను భర్తీ చేయాలి

- సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ వ్యవస్థ లక్ష్యం నీరుగారుతోంది. ఆస్పరి సచివాలయం-1, సచివాలయం-2లో డిజిటల్ అసిస్టెంట్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డిజిటల్ అసిస్టెంట్లు లేకపోతే ప్రజలకు సేవలు ఎలా అందిస్తారు. అధికారులు స్పందించి తక్షణమే డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలి.

జగన్మోహన్ రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు

ప్రజాశక్తి - హొళగుంద

ఆంధ్ర రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమని, ముఖ్యమంత్రి సూచనలతో ప్రజలకు నేరుగా సేవ చేసుకునే అవకాశం దక్కిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. 'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా గురువారం హొళగుంద బీసీ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా ప్రతి సంక్షేమ పథకమూ అందించామని తెలిపారు. అంతకుముందు 'జగనన్న సురక్ష'లో పాల్గొని రైతులకు, విద్యార్థులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. వైసిపి ఆలూరు నియోజకవర్గ బాధితులు నారాయణ స్వామి, ఎంపిపి తనయుడు ఈషా, నాయకులు తోక వెంకటేష్, మండల కన్వీనర్ షఫీవుల్లా, తహశీల్దార్ హుస్సేన్ సాబ్, దినోజు కుమార్, హౌసింగ్ అధికారి ఆదినారాయణ, పిఆర్ ఎఒ సోమప్ప, ఎఒ ఆనంద్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.



హొళగుందలో మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు

4న ఆలూరులో జాబ్ మేళా

ఆలూరు : ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం ఆగస్టు 4న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖమంత్రి గుమ్మానూ జయరామ్ తెలిపారు. గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో జాబ్‌మేళా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ జాబ్‌మేళాలో ప్రముఖ ప్రయివేట్ కంపెనీలు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, పిజి, ఐటిఐ, డిప్లొమా, ఎంబిఎ, బిటెక్ చదివిన వారు అర్హులని చెప్పారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేలు నుంచి రూ.25 వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. జిల్లాలోని అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హత కలిగిన అభ్యర్థులు www.apssdc.in లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 9010003132, 9014588552 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.శంకర్ ప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.



కుందనగుర్తిలో పులి వేషధారణలో ఉన్న యువత

గ్రామాల్లో మొహర్రం కోలాహలం

- వివిధ వేషధారణలతో ఆకట్టుకున్న యువత

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరితో పాటు నేమకల్లు, రామదుర్గం, కుందనగుర్తి తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలను వైభవంగా నిర్వహించారు. పండగ సందర్భంగా యువకులు మహిళలుగా, పులి వేషధారణలో సంబరాలు జరుపుకున్నారు. గురువారం నేమకల్లు, కుందనగుర్తి గ్రామంలో గ్రామస్తులు పులి వేషాలు వేసి వీధుల్లో తిరుగుతున్న నేపథ్యంలో మహిళలు, ప్రజలు మెచ్చుకునే విధంగా ఆకట్టుకున్నారు. ముందుగా గ్రామం పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి డప్పులు, వాయిద్యాలతో, పులి వేషాలు వేస్తూ పీర్లా చావిడికి చేరుకున్నారు. మతాలకతీతంగా పండగ జరుపుకోవడం శుభ పరిణామమని ప్రజలు పేర్కొంటున్నారు. మొహర్రం సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా చిప్పగిరి ఎస్ఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. **ఆలూరు** పట్టణ, గ్రామాల్లో మొహర్రం వేడుకలను కులమతాలకు అతీతంగా ప్రజలు జరుపుకున్నారు. మండలంలోని మనేకుర్తి, అంగస్కల్, మొలగవల్లి, అరికెర, ఆలూరులో పులి, విచిత్ర వేషధారణతో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. డప్పులతో పీర్లచావిడి వద్దకు వెళ్లారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు : ఎఒ

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని పెస్టిసైడ్స్ దుకాణాలు నిర్వహించే డీలర్స్ అధిక ధరలకు పురుగుమందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎఒ సురేష్‌బాబు హెచ్చరించారు. గురువారం దేవనకొండలోని మన గ్రోమోర్, కోరమండల్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు బయోమందులను అమ్మరాదని, కంపెనీ మందులను విక్రయించాలని తెలిపారు. లైసెన్స్ లేకుండా దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పురుగు మందులు కొన్న రైతులకు తప్పకుండా బిల్లులు

సాదాసీదాగా 'కౌన్సిల్ సమావేశం'

- కమిషనర్ రఘునాథ్ రెడ్డిని అభినందించిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ఆదోని

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశంలో చర్చించి పరిష్కార వేదికగా ఉండాల్సిన కౌన్సిల్ సాదాసీదాగా సాగి ప్రాధాన్యత కోల్పోతోంది. సమావేశాలను నామమాత్రంగా నిర్వహిస్తూ సంతకాలకే పరిమితం చేస్తున్నారని పలువురు కౌన్సిలర్లు పేర్కొంటున్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ శాంత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం కోరం లేక గంట ఆలస్యంగా ప్రారంభమైంది. కౌన్సిల్‌లో ఎన్నడూ లేనివిధంగా 63 అంశాలను అజెండాలో పొందుపరిచి ఆమోదానికి ఉంచారు. అందులో 1, 2, 24, 42 అంశాలను మాత్రమే సభ్యులు తిరస్కరించారు. అంతకుముందు 1వ వార్డు కౌన్సిలర్ పార్వతి మాట్లాడుతూ... పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా రాంజల చెరువులో నిల్వ ఉన్న నీటిని సరఫరా చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న నీటిని బయటకు పంపి ఎల్ఎల్‌సి నుంచి కొత్తగా ట్యాంకును నింపితే సౌకర్యంగా ఉంటుందని సభ దృష్టికి తెచ్చారు. సమస్యను కలెక్టర్‌కు విన్నవించామని, ఆమోదం రాగానే ఆ దిశగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఇంజినీర్ నాగభూషణం రెడ్డి వివరించారు. కౌన్సిలర్ బాలాజీ మాట్లాడుతూ... వార్డుల్లో ఇంజినీర్ అసిస్టెంట్లు తమ ప్రమేయం లేకుండానే ఆధునీకరణ పనులు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే, ఛైర్మన్, కౌన్సిలర్ నేమ్ ఫోన్ నెంబర్లు ఉండేలా బోర్డు అమర్చాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా కౌన్సిలర్లను పిలువకుండా అవమానిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. సమస్యలను కౌన్సిలర్లకు తెలియకుండానే ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ తమను చిన్నచూపు చూస్తున్నారని తెలిపారు. వీధిలైట్లు వచ్చినా తమ వార్డులో వేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. అసిస్టెంట్ ఇంజినీర్ కృపాకర్ మాట్లాడుతూ... వీధిలైట్లు పూర్తిస్థాయిలో రాలేదని, వచ్చిన వెంటనే వార్డులు వారీగా అమరుస్తామని తెలిపారు. కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ... తమ వార్డులో సబ్ కలెక్టర్ పర్యటించిన విషయం తమకు తెలియలేదని అన్నారు. సుమారు రూ.3 కోట్లతో జరుగుతున్న అభివృద్ధిని కూడా ప్రజలకు తెలియజేయకుండా మరుగున ఉంచడం ఏమిటని నిలదీశారు. లక్షలాది రూపాయలు వెచ్చించి వాకీటాకీలు కొనుగోలు చేశారని, అవి నిరుపయోగంగా మారాయని కౌన్సిలర్లు అధికారులకు విన్నవించారు. టిడ్కో గృహాల తాళాలు అందజేసిన విషయం తమకు తెలియదని కౌన్సిలర్ బాలాజీ వాపోయారు. కమిషనర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ... వార్డులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో కౌన్సిలర్లను భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు. జగనన్న కాలనీలో రూ.50 కోట్లతో ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, త్వరలోనే కౌన్సిలర్లను అక్కడికి తీసుకెళ్లి చూపిస్తామని చెప్పారు. ఎవరినీ కించపరిచే విధంగా వ్యవహరించేది లేదని తెలిపారు. పట్టణంలో జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో టాయిలెట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దశలవారీగా అభివృద్ధి పరుస్తూ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మున్సిపల్ ఇంజినీర్ నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ... భారీ వర్షాల కారణంగా తుంగభద్ర డ్యాంలో సుమారు 50 టిఎంసిల నీటి నిల్వ ఉందని అక్కడి అధికారులు తెలిపారన్నారు. రెండు, మూడు రోజుల్లో ఎల్ఎల్‌సికి నీరు వదిలే అవకాశం ఉందన్నారు. ఆ నీటిని ఎస్ఎస్ ట్యాంకుకు మళ్లించి పట్టణ వాసులకు తాగునీటి ఎద్దడి రాకుండా చూస్తామన్నారు.

కమిషనర్‌ను అభినందించిన కౌన్సిలర్లు : పట్టణంలో దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న కుళాయిలకు కనెక్షన్ ఇచ్చి సమస్యను పరిష్కరించారని కౌన్సిలర్లు అభినందించారు. కుళాయి లేకున్నా వేలాది రూపాయలు పన్ను వచ్చేదని, పరిశీలించి వాటిని రద్దు పరచడం వల్ల సంబంధిత వ్యక్తులు హర్షిస్తున్నారని, ఇందులో కమిషనర్ రఘునాథ్ రెడ్డి ప్రత్యేక చొరవ అభినందనీయమని కొనియాడారు. కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, చిన్న, చలపతి, అశోక్, ఉస్మాన్, వసీం, ఇంతియాజ్, ఫయాజ్, శాంతి, లోకేశ్వరి, ప్రతిభ, లక్ష్మీదేవి, ఇందు, మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసులు, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డిప్యూటీ ఇంజినీర్లు చలపతి రెడ్డి, రాజు నాయక్, రాజశేఖర్ రెడ్డి, కృపాకర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

'మోడల్' ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ రూపొందించి పదోన్నతులు చేపట్టాలని, 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నందవరం మండలం ముగతి మోడల్ స్కూల్‌ను సందర్శించి, ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులతో సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యాశాఖ పర్యవేక్షణలో మోడల్ స్కూల్ ఉన్నప్పటికీ హెల్త్ కార్డులు లేవని తెలిపారు. కుటుంబ సభ్యులు జబ్బు పడితే వేల రుపాయలు ఖర్చుపెట్టుకోవాల్సి వస్తోందని చెప్పారు. హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. కారుణ్య నియమాకాలు లేనందు వల్ల ఉద్యోగి చనిపోతే వీరి కుటుంబం రోడ్డున పడుతుందని తెలిపారు. ఇప్పటి వరకు 21మంది చనిపోయారని, వీరి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. కారుణ్య నియమాకాలు చేపట్టాలని కోరారు. సిపిఎస్ అమౌంటు డిడక్షన్ చేస్తున్నారని, ఆ అమౌంటు తమ అకౌంటుకు జమ అవుతుందో లేదో తెలియడం లేదని అన్నారు. అలాగే ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు వేస్తున్నారో లేదో కూడా తెలియడం లేదన్నారు. యుటిఎఫ్ నాయకులు విరుపాక్షి, భాగ్యరాజు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లప్ప

మోడీ పాలన నుంచి ఆడబిడ్డలను రక్షించాలి

- కౌతాళంలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - కౌతాళం

దేశంలో నరేంద్ర మోడీ పాలనను తరిమికొట్టాలని, మోడీ పాలన నుంచి ఆడబిడ్డలను రక్షించాలని నాయకులు కోరారు. గురువారం ఆవాజ్ కమిటీ, జై భీమ్ కమిటీ ఆధ్వర్యంలో కౌతాళంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సిఎస్ఐ చర్చి దగ్గర నుంచి ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జై భీమ్ నాయకులు వీరేష్, అవతారం, దర్గా ధర్మకర్త మున్నా పాషా, ఆవాజ్ నాయకులు మాట్లాడారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసకాండను వెంటనే ఆపాలని, అక్కడ ఉన్న క్రిస్టియన్లను కాపాడాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మరణ హోమం జరుగుతున్నా ప్రధాని స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. రాబోయే ఎన్నికల్లో బిజెపికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఆవాజ్ నాయకులు ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చెరువును తలపించిన రోడ్డు

- మేల్కొన్న మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - ఆదోని



అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న అధికారులు

పట్టణంలో చిన్నపాటి వర్షమొచ్చినా రోడ్డుపై నీరు నిలిచి జనం రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల రైల్వే స్టేషన్ రోడ్డులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణ చెరువును తలపించింది. భారీగా నీరు నిలవడంతో సమీప దుకాణదారులు బంద్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటువైపు వెళ్లేవారు మురుగునీటిలోనే నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కాలువల వెడల్పు, పూడికతీత కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూనే ఉన్నారు. సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని పురవాసులు వాపోతున్నారు.

మేల్కొన్న మున్సిపల్ అధికారులు : కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించింది. మర్చంట్ క్లబ్ వద్ద కల్వర్టులో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. రోడ్డుపై నీరు నిలిచింది. స్థానికల నుంచి వ్యతిరేకత రావడంతో మేల్కొన్న మున్సిపల్ అధికారులు గురువారం రెవెన్యూ భవన్ నుంచి మర్చంట్ క్లబ్ వరకు కాలువలపై ఏర్పాటు చేసుకున్న బంకులను, కట్టడాలను తొలగించారు. అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు హెచ్చరించారు. కట్టడాలు కూల్చివేయడంతో నీరంతా కాలువల వెంట పారి సమస్య పరిష్కారమైంది. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఇంజనీర్ నాగభూషణం రెడ్డి ఉన్నారు.

కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని సిఐటియు తాలూకా కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు జె.నాగరాజు అధ్యక్షత ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు హామీఇచ్చారని తెలిపారు. నాలుగేళ్లయినా హామీ నెరవేరలేదన్నారు. కరోనా వల్ల కార్మికులు మరణిస్తే నేటికీ కారుణ్య నియామకాలు చేపట్ట లేదన్నారు. మున్సిపల్ కార్మికులు, నాయకులు ఇస్మాయిల్, తిమోతి, మునీంద్ర, వీరేష్, పల్లవి రాజు, కేశన్న, ఉరుకుంద, మల్లికార్జున, సాల్మెన్, తిక్కయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి
శుక్రవారం 28 జూలై 2023
5
నంద్యాల





నందిగుడి ప్రధాన కూడలి సమీపంలో ఏర్పాటు చేసిన నూతన కౌంటర్లను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

కుంటల్లా రోడ్లు

- చిన్నపాటి వర్షానికే బురదమయం

- వాహనదారులకు తీవ్ర అవస్థలు



చాగలమర్రి ఒకటో వార్డులో నీటి కుంటలా మారిన రహదారి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/విలేకరులు

చిన్నపాటి వర్షం వచ్చిందంటే చాలు గ్రామీణ రోడ్లన్నీ కుంటల్లా మారిపోతున్నాయి. చాలా రోడ్లు కంకర, మట్టి తేలడంతో చినుకు పడగానే చిత్తడిగా మారిపోతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు...

మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి గ్రామీణ రహదారులు బురదమయంగా మారిపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ గ్రామీణ ప్రాంతాల రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. **చాగలమర్రి** పట్టణంలో వర్షపు నీరు అంతా రహదారి పైకి చేరి నీటికుంటగా మారింది. రహదారిపై నీరు చేరడంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు రోజుల తరబడి నిలబడడంతో దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు వ్యాప్తి చెంది రాత్రి పూట కంటిమీద కునుకు ఉండడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి రహదారులపై మురికి నీరు నిలువ లేకుండా చేయాలని కోరుతున్నారు. **నందికొట్కూరు** పట్టణంలోని 2వ వార్డు శాంతి థియేటర్ వెనుక సందు డంపు యార్డుకు వెళ్లేదారి సిసి రోడ్డు లేక పరిస్థితి దారుణంగా తయారైంది. అధికారులకు ఎన్నిసార్లు సమస్యను గురించి తెలియజేసిన వారు ఎటువంటి పరిష్కారం చూపలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **కొత్తపల్లి** మండలంలోని లింగాపురం గ్రామ ప్రధాన రహదారిపై మురుగు నీరు నిల్వ ఉండటంతో బురుదగుంటలా తయారైంది. **మహానంది** మండలంలోని ఎంసి.ఫారం గ్రామం నుండి మహానంది పుణ్యక్షేత్రం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారి అడుగు కో గుంతతో వాహనదారులకు దర్శనమిస్తోంది. మండలంలో గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ గుంతలలో నీరు చేరి రహదారులు వాహనదారులకు చెరువుల వలే దర్శనమిస్తూ అటుగా వచ్చే వాహనదారులకు అగచాట్లకు గురి చేస్తున్నాయి. శ్రీశైలం, తిరుపతి క్షేత్రాల నుండి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల వారే కాక మన తెలుగు రాష్ట్రాల నుండి మహానంది పుణ్యక్షేత్రంనకు ప్రతినిత్యం వందల సంఖ్యలో భక్తుల వాహనాలు ఈ రహదారుల గుండానే రావలసి ఉంది. కొత్తగా క్షేత్రానికి వచ్చే వాహనదారులకు చెరువుల వలే కనిపిస్తున్న ఈ రహదారులు చూసి దారి తప్పి అడవులలోకి వెళ్ళామా అనే పరిస్థితి నెలకొంది. ఈ రహదారి గుండా క్షేత్రానికి వచ్చిన భక్తులు చాలా పర్యాయాలు వారి వాహనాలు ఈ గుంతలలో ఇరుక్కొని వాహనాలు రిపేర్లు వచ్చిన పరిస్థితులు కూడా చాలా ఉన్నాయి.



మహానంది మండలంలో ఎంసి ఫారం నుంచి మహానందికి వెళ్లే రోడ్లులో గుంతలు

అధికారులు పట్టించుకోవడం లేదు



ఏ కొద్దిపాటి వర్షం పడిన రహదారిపై మోకాళ్ళ లోతు నీరు నిల్వ ఉంటుంది. కాలనీవాసులకు రాకపోవులకు తీవ్ర ఇబ్బంది కరంగా మారింది. ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదు. మురికి నీరు నిలువ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారిపై మురికి నీరు నిల్వ లేకుండా చూడాలని కోరుతున్నాం.

మల్లన్న దర్శనం మరింత సులభం

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

- నూతన కౌంటర్లు, శ్రీశైలం యాప్ ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దర్శనం భక్తులకు మరింత సులభం కానుందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. భక్తులు ఆన్లైన్ ద్వారా శ్రీ స్వామి వారి స్పర్శ దర్శనం, ఇతర ఆర్జిత సేవల టిక్కెట్లను మరింత సులభతరంగా పొందేందుకు వీలుగా రూపొందించిన యాప్‌ను గురువారం ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. ముందుగా ఉప ముఖ్యమంత్రి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారి వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు వీరికి వేద ఆశీర్వచనం పలికి, శేష వస్త్రాలను, ప్రసాదాలను, జ్ఞాపికను దేవస్థానం ఇఒ లవన్న అందజేశారు. ఆ తరువాత నందిగుడి ప్రధాన కూడలి సమీపంలోని టూరిస్ట్ ఫెసిలిటేషన్ సెంటర్ ప్రాంగణంలో దేవస్థాన ప్రచురణల విక్రయ కేంద్రాన్ని, సెంట్రల్ రిసెప్షన్ కౌంటర్, సెంట్రల్ రిసెప్షన్ ఆఫీసులో వసతికేటాయింపు, విఐపి బ్రేక్ దర్శనంల కౌంటర్లను మంత్రి ప్రారంభించారు. అనంతరం స్పర్శ దర్శనం టికెట్లు పొందేందుకు రూపొందించిన శ్రీశైలం యాప్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ యాప్‌ను మరో రెండు, మూడు రోజులలో ప్లే స్టోర్ ద్వారా భక్తులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

ఆలయ ఉద్యోగుల వయో పరిమితి 62కు పెంపు

రాష్ట్ర క్యాబినేట్ సమావేశంలో రాష్ట్రంలోని ఆలయాల ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయో పరిమితి 60 నుంచి 62 సంవత్సరాలకు పెంపుదల చేసిన సందర్భంగా మంత్రిని శ్రీశైల దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం సన్మానించింది. దేవస్థానం ఇఒ లవన్న, ఉద్యోగ సంఘం అధ్యక్షులు సుబ్బారెడ్డి, కార్యదర్శి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యా దీవెన

- ఐదుగురు లబ్ధిదారులకు రూ. 64.24 లక్షలు వారి ఖాతాల్లో జమ

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం సంబంధించి 2022-23 సంబంధించి ఐదుగురు విద్యార్థులకు 64 లక్షల 24 వేల 012 రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ తెలిపారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన 357 మంది విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో 45.53 కోట్ల రూపాయలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి చింతామణి, మైనారిటీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీదేవి, విద్యార్థులు, విద్యార్థుల తలిదండ్రులు తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదరికం కారణంగా ఉన్నత విద్యాభ్యాసం కోసం విదేశాలకు వెళ్లలేని విద్యార్థుల కోసం ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకం కింద జిల్లాలో 2022-23 సంబంధించి 5 మంది విద్యార్థులకు 64 లక్షల 24 వేల 012 రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ఈ ఆర్థిక సహాయాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువులో రాణించి ఉన్నత పదవులను అలంకరించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ, మార్క్‌ఫెడ్ చైర్మన్, తదితరులు విద్యార్థులు, విద్యార్థుల తల్లులకు చెక్కును అందజేశారు.



శ్రీశైలానికి నీటి ప్రవాహం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణానది పరివాహక ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాల వలన శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం ప్రారంభమైనది. గురువారం మూడు గంటల సమయానికి ఎగువ జూరాల నుండి 70,422 క్యూసెక్కులు, హంద్రీ నుండి 1125 వేల క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతున్నాయి. అదే సమయానికి జలాశయం నీటి మట్టం 817.70 అడుగులుగా, నీటి నిలువ సామర్థ్యం 39.2025 టిఎంసిలుగా నమోదయింది. రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలోని జల విద్యుత్ కేంద్రాలల్లో విద్యుత్ ఉత్పత్తి చేయడం లేదు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద

హోళగుంద : కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ, చిత్రదుర్గ, బెళగావి, చిక్కమంగళూరు, తదితర ప్రాంతాల్లో గతవారం రోజులుగా అధిక వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర డ్యాంకు వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం 1,11,566 క్యూసెక్కుల నీరు తుంగభద్రలోకి వచ్చి చేరుతోంది. జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 105.788 టిఎంసిలు కాగా ప్రస్తుతం 49.76 టిఎంసిలుగా ఉంది. జలాశయ గరిష్ట నీటి మట్టం 1633 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 1615.56గా ఉంది. గత రెండు నెలలుగా వర్షాలు లేక డ్యాంకు వరద నీరు రాకపోవడంతో ఈ ఏడాది ఎల్ఎల్‌సి కాల్వ కింద సాగు ప్రశ్నార్థకమే అనుకున్న అన్నదాతలకు ప్రస్తుతం తుంగభద్ర డాం వరద నీరు వచ్చి చేరతుండడంతో అన్నదాతలు ఆనందంలో మునిగి తేలుతున్నారు.



శ్రీశైలం జలాశయం

ప్రధాని, హోంశాఖ మంత్రి, మణిపూర్ సిఎంలు

రాజీనామా చేయాలి

- సిపిఎం, రైతు సంఘం నేతలు డిమాండ్



ఆళ్లగడ్డలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం, రైతు సంఘం నాయకులు, మహిళలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మణిపూర్‌లో శాంతి భద్రతలను అరికట్టలేని దేశ ప్రధాని మోడీ, హోంశాఖ మంత్రి అమిత్ షా, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌లు వెంటనే రాజీనామా చేయాలని సిపిఎం, రైతు సంఘం జిల్లా నేతలు డిమాండ్ చేశారు. మణిపూర్ రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాలని, దాడులకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, ప్రధాని, హోం శాఖ మంత్రి, ఆ రాష్ట్ర సిఎంలు రాజీనామా చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ఆళ్లగడ్డలోని నాలుగు రోడ్ల కూడలిలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామ చంద్రుడు, నాయకులు శంకరయ్య మాట్లాడారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా రోడ్ల వెంట తిప్పుతూ, సామూహికంగా అత్యాచారాలకు పాల్పడి, అడ్డు వచ్చిన కుటుంబ సభ్యులను ఘోరంగా చంపడం అమానుషమన్నారు. క్రిస్టియన్ మతానికి చెందిన కుకీ తెగ ప్రజలపై దాడులు, ఇండ్లకు నిప్పు, మన దేశ సరిహద్దుల్లో కార్గిల్ యుద్ధంలో పోరాడిన జవాన్ల కుటుంబాలను వేధించి చంపడం, స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలను సర్వనాశనం చేయడం ఆ రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ విధానాలకు నిదర్శనం అన్నారు. మెయితీ తెగకు చెందిన మెజారిటీ ప్రజలను రెచ్చగొట్టి, మైనార్టీగా ఉన్న కుకీ తెగలపై పథకం ప్రకారమే దాడులు చేయిస్తూ, వారి



నివాళులర్పిస్తున్న మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి

అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శం

- మాజీ సర్పంచి బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె : భారతరత్న, మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం అందరికీ ఆదర్శప్రాయులని పట్టణ మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి పేర్కొన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం తమిళనాడులోని రామేశ్వరం గ్రామంలో ఓ నిరుపేద కుటుంబంలో జన్మించి ఎన్నో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని తెలిపారు. చిన్న వయసులోనే పేపర్ బాయ్‌గా పని చేస్తూ, గురువుల మాటలను అవలోకనం చేసుకొని కష్టనష్టాలను ఎదుర్కొంటూ ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించినట్లు చెప్పారు. మేధో సంపత్తితో క్షిపణి శాస్త్రవేత్తగా ఎదిగి అణుబాంబు తయారు చేసి అణు పితామహుడిగా పేరు సంపాదించారన్నారని అన్నారు. నేటి విద్యార్థులు, యువత కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు అల్తాఫ్ హుస్సేన్, టిప్ టాప్ కలాం, నుసి విష్ణువర్ధన్ రెడ్డి గడ్డం నాగేశ్వర రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శనీయమని తహశీల్దార్ హరినాథ్ రావు, పట్టణ ఎస్ఐ వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో అబ్దుల్ కలాం విగ్రహం వద్ద ఆయన వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆపుస్మా సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్ భాషా ఆధ్వర్యంలో తహసిల్దార్, టౌన్ ఎస్ఐలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమీర్ భాష మాట్లాడుతూ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఒక గొప్ప సైంటిస్ట్‌గా, దేశ రాష్ట్రపతిగా మహోన్నత సేవలను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, ప్రముఖ వైద్యుడు డాక్టర్ రామ్ గోపాల్ రెడ్డి, ఏఎస్ఐ నాగమల్లేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి:** మండల కేంద్రమైన చాగలమర్రిలో శివాలయం కాలనీలో గల సల్ల నాగరాజు నివాసంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా, సైంటిస్ట్‌గా దేశానికి అనేక సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో పియుసి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, పార్టీ నాయకులు వీరం రెడ్డి భాస్కర్ రెడ్డి, టైలర్ మహబూబ్బాషా, సురేష్ కుమార్ రెడ్డి, కశినేని ఓబులేసు, టైలర్ చోటు, అబ్దుల్లా, దూదేకుల లాల్ బాషా, ఫక్రుద్దీన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలపై అక్రమ కేసులు అన్యాయం

- దేవాలయ భూములు కౌలుకి అడిగితే నేరమా..?

- కేసులు పెట్టి కోర్టుకు అప్పగించడం దారుణం

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలం ఎల్లావత్తల గ్రామంలో అనేక సంవత్సరాల నుండి ఆధీనంలో ఉన్న దేవాలయ భూములను భూమిలేని నిరుపేదలకు కౌలుకు ఇవ్వమని అడిగినందుకు అక్రమ కేసులు కేసులు బనాయించి కోర్టుకు అప్పగించడం దారుణమని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రమేష్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు గురువారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దేవాలయ అధికారులు, కొంతమంది భూస్వాములు, ప్రభుత్వ యంత్రాంగం కలిసి నిరుపేదలపై అక్రమ కేసులు బనాయించి 16 నెలల తర్వాత కోర్టుకు అప్పగించడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. 2002లో దేవాలయ భూములను ఎల్లావత్తుల గ్రామంలోని భూమిలేని నిరుపేదలు ఎన్నో సంవత్సరాల నుండి సాగు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. ఆ భూమిని భూమిలేని నిరుపేదలు తమకు కౌలుకు ఇస్తే తాము చెల్లించి పంటలు పండించుకుని బతుకుతామని దేవాలయ అధికారులను, జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దారు, ఎమ్మెల్సీలను కోరారన్నారు. సమస్యను పరిష్కారం చేయకపోగా భూములు ఉన్న వాళ్లకే దేవాలయ భూములను కట్టబెట్టి పేదల కడుపులు కొట్టారన్నారు. ఇది అన్యాయమని నిలదీసిన పేదలపై నాడు బైండోవర్ కేసులు పెట్టి స్థానిక తహశీల్దారి ముందు పోలీసులు హాజరు పరిచారని, ఆ రోజే నిరుపేదలు, రైతు సంఘం నాయకులు కలిసి బైండోవర్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తే బైండోవర్ ఎత్తివేస్తున్నామని చెప్పిన అధికారులు మళ్లీ అక్రమంగా కేసులు బనాయించి నేడు రైతు సంఘం నాయకులను, పేదలను మొత్తం 32 మందిని ఆళ్లగడ్డ కోర్టుకు అప్పగించడం అన్యాయమని పేర్కొన్నారు. ఒకవైపు మండలంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమిని ధనవంతులే ఆక్రమించుకొని అక్రమంగా పట్టాలు పొందుతూ సాగు చేసుకుంటున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. నిరుపేదలు బతకడానికి కౌలుకు భూములు ఇవ్వమంటే అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ఎల్లావత్తుల గ్రామంలోని నిరుపేదలకు జరిగిన అన్యాయంపై విచారించాలని, భూమిలేని పేదలకు ప్రభుత్వ భూమినైనా పంపిణీ చేయించి వారి కుటుంబాల్లో వెలుగు నింపాలని డిమాండ్ చేశారు.



ప్రోత్సాహక బహుమతిని అందజేస్తున్న దృశ్యం

మేస్త్రీలకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని టీబీ రోడ్‌లో జువారి సిమెంట్ సంస్థ ఆధ్వర్యంలో మేస్త్రీలకు ప్రోత్సాహకాలను జువారి డీలర్ శేఖర్ గురువారం పంపిణీ చేశారు. అనంతరం జరిగిన మేస్త్రీల, కాంట్రాక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము నాణ్యమైన జువారి సిమెంటు ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ జీలాన్ బాషాతో పాటు మరి కొంతమందికి ప్రోత్సాహక బహుమతులను డీలర్ అందజేసి అభినందించారు. జిలాని మాట్లాడుతూ జువారి సిమెంట్ నాణ్యతగా ఉండటం వల్ల తాము ఎక్కువగా వాడతామన్నారు.

కోల్డ్ స్టోరేజీలను అధికారులు తనిఖీ

- 38 క్వింటాళ్ల మిర్చీ సీజ్

- ఎండు మిర్చీ క్రయ, విక్రయాలు జరిపితే కఠిన చర్యలు

- విజిలెన్స్, వ్యవసాయ మార్కెట్ అధికారులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాలలోని పలు కోల్డ్ స్టోరేజ్‌లను విజిలెన్స్, వ్యవసాయ మార్కెట్ అధికారులు గురువారం విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రూ.8 లక్షలు విలువ చేసే 38 క్వింటాళ్లు మిర్చిని సీజ్ చేశారు. మిర్చీ మార్కెట్ యార్డులో కాకుండా గోడౌన్‌లలో, కోల్డ్ స్టోరేజ్‌లలో ఎండు మిర్చీ క్రయ విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని అధికారులు కమీషన్ ఏజెంట్లను, కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులను హెచ్చరించారు. సీజన్ తగ్గడంతో మిర్చీ మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్లు, లైసెన్స్ ట్రేడర్స్ దళారులు కలిసి రైతుల మిర్చీ పంటను యార్డ్ అనుమతి లేకుండా నేరుగా కోల్డ్ స్టోరేజ్‌లలోనే క్రయ, విక్రయాలు జరుపుతున్నట్లు ప్రజాశక్తి రాసిన కథనానికి స్పందించిన కలెక్టర్ ఆదేశాలతో విజిలెన్స్, వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు గురువారం పట్టణ శివారులోని అయ్యాలూరు మెట్ట వద్ద వున్న కిసాన్ కోల్డ్ స్టోరేజ్‌తోపాటు సాయి వెంకటేశ్వర కోల్డ్ స్టోరేజ్‌లను తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న స్టాక్‌ను విజిలెన్స్ సీఐ కె. సునీల్ కుమార్, మార్కెట్ యార్డ్ సెక్రటరీ కల్పనా, మార్కెటింగ్ శాఖ ఏడి ఎస్. అబ్దుల్ రహిమాన్‌లు పరిశీలించారు. కిసాన్ కోల్డ్ స్టోరేజ్ గోడౌన్‌లో రికార్డ్‌లలో లేని మిర్చిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ మాట్లాడుతూ పూర్తి స్థాయిలో రికార్డ్‌లు పరిశీలించి సమాచారాన్ని నివేదిక రూపంలో జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ సెక్రటరీ మాట్లాడుతూ ట్రేడింగ్ లైసెన్స్ లేని వాళ్ళ కోల్డ్ స్టోరేజ్‌లలో రైతులు నిల్వ ఉంచుకున్న మిర్చిని వేలం వేసి కొనుగోళ్లు సాగిస్తున్నారన్నారు. సమాచారం మేరకు గోడౌన్‌లను తనిఖీ చేపట్టామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ అసిస్టెంట్ సెక్రటరీ శేషి రెడ్డి, సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస మూర్తి, మార్కెటింగ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రికార్డ్‌లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కార్మికులకు రెయిన్ కోట్‌లు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వర్షాకాలం సందర్భంగా పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్‌లను 4వ వార్డు కౌన్సిలర్ ఎస్. తబ్రేజ్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఎండకు, వానకు కష్టపడుతుంటారని తెలిపారు. వర్షాకాలంలో వారు తడవకుండా రెయిన్ కోట్లు ఇవ్వడం వల్ల వారి ఆరోగ్యం బాగుంటుందని, వర్షంలో తడవకుండా విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. గతంలో కూడా చలికాలంలో వారికి వెచ్చని స్వెటర్లు అందజేశామన్నారు. కో ఆప్షన్ సభ్యులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల కోసం ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం హర్షనీయమని అభినందించారు. కార్యక్రమంలో సచివాలయ శానిటరీ సూపర్వైజర్ హనుమంతు, మునిసిపల్ మేస్త్రి ప్రవీణ్, వైసిపి నాయకులు రామయ్య, రసూల్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ తబ్రేజ్, కో ఆప్షన్ మెంబర్ సుబ్రహ్మణ్యం

బాబును నమ్మితే రాష్ట్రంలో పథకాలు ఉండవు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలు నమ్మితే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ఉండవని శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. గురువారం ఎర్రగుంట్ల సర్పంచ్ కాలూరి శ్వేత కుమారి, పార్నపల్లి సర్పంచ్ షేక్ షబ్బీర్ అహ్మద్‌ల అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం పార్నపల్లి, ఎర్రగుంట్ల గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు అవుతున్నాయని, రైతులకు, కూలీలకు, పేద ప్రజలకు, పొదుపు మహిళలకు దారిద్ర రేఖకు దిగువనున్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు మళ్లీ అమలు కావాలంటే రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని, శ్రీశైలం నియోజ కవర్గంలో తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం వైకాపా సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, పార్లపల్లె ఉపసర్పంచ్ రామలింగేశ్వర్ రెడ్డి, వైకాపా యువ నాయకులు కడిపి రెడ్డి, దిలీప్ కుమార్ రెడ్డి, వైకాపా నాయకులు పుల్లారెడ్డి, దే రెడ్డి మధుసూదన్ రెడ్డి, దే రెడ్డి జనార్ధన్ రెడ్డి, వైకాపా నాయకులు ప్రసాద్, ఎర్రగుంట్ల ఎంపిటిసి సభ్యులు కాలూరి బాలన్న, ఎంపీడీవో వాసుదేవ గుప్తా, డిప్యూటీ తాసిల్దార్ హరిత, ఏఈ సుంకిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ఎర్రగుంట్లలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : ఎస్‌పి



పోలీసులతో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పి రఘువీరారెడ్డి

ప్రజాశక్తి - అవుకు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన అవుకు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. డోన్ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి, బనగానపల్లె సిఐ తిమ్మారెడ్డి, అవుకు ఎస్సై నరేంద్ర కుమార్, సిబ్బంది జిల్లా ఎస్పీకి ఘన స్వాగతం పలికి గౌరవం వందనం సమర్పించారు. అనంతరం జిల్లా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణంలోని వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. విలేకరులు అవుకు పట్టణంలో ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉందని, రోడ్లపైనే చికెన్, మటన్ వ్యాపారాలు కొనసాగుతున్నాయని, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని ఆయన దష్టికి తీసుకెళ్లారు. సిఐ తిమ్మారెడ్డి, అవుకు ఎస్సై నరేంద్రలకు ట్రాఫిక్ సమస్యపై ఎస్‌పి సలహాలు, సూచనలు ఇచ్చారు. వారం వ్యవధిలోనే అవుకులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలపై తరచుగా ప్రజలకు, ఆటో డ్రైవర్లకు, లారీ డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు అవగాహన సదస్సులు కల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి తనిఖీ చేశారు. వార్షికోత్సవ తనిఖీల్లో భాగంగా ఎస్పీ రికార్డులను, క్రైమ్ రేటును పరిశీలించారు. జిల్లా ఎస్పీకి సీఐ తిమ్మారెడ్డి, ఎస్సైలు రామిరెడ్డి, వీరాంజనేయులు ల ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో డోన్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి ,పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని నందివర్గం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. ఎస్సై రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ఎస్పీకి ఘన స్వాగతం పలికారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష పథకం అమలు చేస్తున్నట్లు ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని గోరుమానిపల్లె, కమ్మవారిపల్లె గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో నెలరోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అనంతరం 11 రకాల ధ్రువపత్రాలను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ మొలక రాజారెడ్డి, వైసిపి ప్రచార జిల్లా అధ్యక్షులు పేరం సత్యనారాయణరెడ్డి, సర్పంచి రామాంజనేయులు, జగన్, ఎంపిటిసి పులి ప్రకాష్ రెడ్డి, ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి, నందిపాడు సర్పంచ్ గురువిరెడ్డి కలవటాల తిమ్మారెడ్డి, కమ్మవారిపల్లె సర్పంచ్ కొండయ్య, ఆర్డబ్ల్యూఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరూ లబ్ధి పొందాలన్నదే తమ లక్ష్యమని గ్రామ సర్పంచ్ బైరి విజయలక్ష్మి అన్నారు. గురువారం రుద్రవరంలోని మార్కెట్ ఆవరణంలో మొదటి సచివాలయం పరిధిలో సర్పంచి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎంపిడిఒ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం 11 రకాల ధ్రువపత్రాలను సర్పంచి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎంపిడిఒ మధుసూదన రెడ్డి, తహశీల్దార్ రవీంద్ర ప్రసాద్, ఎంపిపి బాలస్వామి, వైసిపి నాయకుడు బైరి బ్రహ్మం, ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **సంజామల :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన 11 రకాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నాగ కుమార్ కోరారు. మండలంలోని కానాల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **వెలుగోడు :** పట్టణంలోని సిపి నగర్‌లోని గ్రామ సచివాలయం-5ను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రారంభించారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వెలుగోడు మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్‌ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది, వాలంటీర్లు, పాల్గొన్నారు. **బేతంచర్ల :** మండలంలోని ఆర్ కొత్తపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ మహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైయస్సార్ పి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి పాల్గొని ధృవపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బేతంచర్ల డిప్యూటీ తాసిల్దార్ సత్యదీప్, ఎంపీటీసీ మునేశ్వర్ రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళీకృష్ణ, రామా నాయుడు, తిరుమలేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి:** మండలంలోని ముసలమడుగు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం ముగిసినట్లు ఎంపీడీవో మేరీ, తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. గురువారం నాడు సర్పంచ్ జమిలాబి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిడిఒ, తహశీల్దార్ పాల్గొని సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా ఎంపీటీసీ ముబీనా బేగం, డిప్యూటీ తహసిల్దార్ పెద్దన్న, వ్యవసాయ అధికారి మహేష్, ఏపీఎం పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు. **చాగలమర్రి:** మండలంలో డీ వనిపెంట, గోడిగనూరు గ్రామాల సచివాలయం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచులు రేనాటి బాలేశ్వర్ రెడ్డి, చీపాటి సంజీవ రాయుడు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తాసిల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో మొహబబ్ దౌల, మండల విస్తరణ అధికారి ఎస్ఎస్-ఎస్ సుదర్శన్ రావు, ఎంపీటీసీ పత్తి నారాయణ పాల్గొని సర్టిఫికెట్లను, కౌలు కార్డులను అందజేశారు. సచివాల కార్యద ర్శులు దస్తగిరి, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు. **పాములపాడు:** మండలంలోని వానాల, ఎర్ర గూడూరు గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వానాల గ్రామంలో ఎంపీడీవో గోపి కృష్ణ, ఎర్రగుడూరు గ్రామంలో తాసిల్దార్ రత్న రాధిక పాల్గొని సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. సర్పంచ్ లత, ఎంపిటిసి దర్గా బాయ్, వైసిపి నాయకులు బాలీశ్వర్ రెడ్డి, ప్రతాప రెడ్డి, రాజన్న, ఏవో పణీశ్వర్ రెడ్డి, ఏపీవో విమలమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు. **నందికొట్కూరు:** మండలంలోని మల్యాల గ్రామంలో సర్పంచ్ ఉమాదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో తాసిల్దార్ రాజశేఖర్ బాబు, ఎంపీడీవో శోభారాణి హాజరై ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, రవీంద్ర, చంద్రశేఖర్, ఏపీఓ అలివేలమ్మ, వివో ఓ, శాంత రాజు, తదితరులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్ను అందజేస్తున్న జడ్పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి


వెలుగోడు : ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న నాయకులు



కొత్తపల్లి: సర్టిపికెట్లను అందజేస్తున్న నాయకులు, అధికారులు



నష్టపోయిన రైతులను ఆదుకోండి : సిపిఎం



ప్రజాశక్తి - ఆత్మకూర్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆత్మకూరు అగ్రికల్చర్ ఏడిఏ ఆంజనేయులుకి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి యేసు రత్నం, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రాజశేఖర్, కొత్తపల్లి సిపిఎం మండల నాయకులు ఎన్ స్వాములు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు రైతులకు సరైన సమయంలో పడక ఆలస్యంగా రావడం వల్ల రైతులు అప్పులు చేసి వేల రూపాయల పెట్టుబడి పెట్టి పంటలను సాగు చేశారని,వారం రోజులపాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడం వల్ల పంటలన్నీ నీట మునిగి పూర్తిగా దెబ్బ తిన్నాయని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సచివాలయ అధికారులు గ్రామాల్లో కనీసం పంట నమోదు చేయలేదని అన్నారు. ఇప్పటికైనా అగ్రికల్చర్ అధికారులు నీట మునిగిన పంటలను పరిశీలించి పంటల నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి పంపించాలని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఏడిఏ ఆంజనేయ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో అగ్రికల్చర్ అధికారులతో నష్టపోయిన పంటలను అంచనాలు తయారు చేయిస్తామని రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్ దాసు, చిన్న చిన్నయ్య, దేవకుమార్, జి దాసు, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు బొల్లు ప్రసాద్ బాబు యాదవ్ , రవి, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

బీమా వర్తింపజేయాలి

కొత్తపల్లి: గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పంటల బీమా వర్తింపజేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం నాయకులు ఎన్ స్వాములు, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్ సంజీవ రాయుడు ,బి శంకర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని దెబ్బతిన్న పంటలను సిపిఎం రైతు సంఘాల నాయకులు శివపురం, సింగరాజుపల్లి గ్రామాల్లోని నీటమునిగిన మొక్కజొన్న పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపి ఎం నాయకులు ఎన్ దాసు, ఎన్ దేవకుమార్, పి చిన్న చిన్నయ్య, రైతు సంఘం నాయకులు జి దాసు, భాస్కర్, రాజు, ఎన్ ప్రభాకర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు

ప్రధాని, హోంశాఖ మంత్రి, మణిపూర్ సిఎంలు రాజీనామా చేయాలి


నిరసన తెలుపుతున్న నాయకులు

(5వ పేజీ తరువాయి..) బిజెపి ప్రభుత్వం వత్తాసు పలకడమే ప్రధాన కారణమన్నారు. దేశంలో శాంతిభద్రతలు కాపాడాల్సిన ప్రధాని, హోం శాఖ మంత్రి కూడా అక్కడి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ ఆరాచక పాలనకు కారణమవుతున్నారని చెప్పారు. దేశంలోని ప్రజాస్వామ్యవాదులందరూ మణిపూర్ అంచకాలను ఖండించాలన్నారు. దాడులకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించి ప్రధానమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రపతి కూడా వెంటనే జోక్యం చేసుకొని ఆ రాష్ట్రంలో శాంతి భద్రతలను పరిరక్షించాలని, దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుదర్శనం, వలి, మహబూబ్ బాషా, లక్ష్మీదేవి, ఆశ, హుస్సేన్ బీ తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు:** మణిపూర్‌లో కుకీ,నాగా తదితర ఆదివాసీలపైన, క్రైస్తవ చర్చి ల పైన జరుగుతున్న దాడులను, స్త్రీల పై చేస్తున్న అత్యాచారాలను అరికట్టాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మణిపూర్ ఘటనను నిరసిస్తూ నందికొట్కూరు పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గర రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఐ.ఎఫ్.టి.యు జిల్లా అధ్యక్షులు పి. మజీద్ మియా, జిల్లా నాయకులు పి లాజర్ పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షుడు పి.మద్రిస్వామి మాట్లాడుతూ తరతరాలుగా కలిసిమెలిసి జీవిస్తున్న మైతేయి, కుకీ, నాగాల మధ్య మత చిచ్చు రగిలించి, రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్న కేంద్రంలోని మోడీ-షా సర్కార్, రాష్ట్రంలోని బీరెన్ సర్కార్లు ప్రధాన దోషులని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు ఎస్ .చురిబి బి.లక్ష్మీదేవి,కే.రాధమ్మ, ఎస్. కవిత, ఎల్లు పద్మా వతి ఐఎఫ్టియు కార్మికులు వెంకటేశ్వర్లు వీ ఆంజనేయులు డి. వెంకటేశ్వర్లు, మధు, డి .మద్దిలేటి, బాలు, నాగేంద్రయ్య, ఆజమ్మ,లక్ష్మీదేవి, మాల.యేసు పిడిఎసు డివిజన్ నాయకులు దాసు,రాజు తదితరులు పాల్గొన్నారు.


నూతన పాలసీని ప్రారంభిస్తున్న చైర్మన్ డాక్టర్ ఆసియా


జీవన్ కిరణ్ పాలసీని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఆత్మకూర్

ప్రజలందరికీ ఆర్థికంగా బలోపేతం చేయూ తనిచ్చే విధంగా ఎల్ఐసి బీమా సౌకర్యం ఎంతో ఉపయో గకరంగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా తెలిపారు. గురువారం పట్టణంలోని జీవనజ్యోతి ఎల్ఐసి కార్యాలయంలో నూతన జీవన్ కిరణ్ ఎల్ఐసి పాలసీని లాంచనంగా ప్రారంభించారు. ముందుగా స్థానిక ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ మధుసూదన్ శెట్టి మున్సిపల్ చైర్మన్‌కు మర్యాదపూర్వకంగా పూల పుష్పాలతో ఆహ్వానం పలికారు. అనంతరం ఎల్ఐసి జీవన్ కిరణ్ నూతన పాలసీని మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ జీవన్ కిరణ్ పాలసీ తక్కువ ప్రీమియంతో ఉపయోగించుకోవచ్చు అన్నారు. అనంతరం ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్ మాట్లాడారు. ఎల్ఐసి బ్రాంచ్ అభివద్ధి కోసం కృషి చేస్తున్న సెంట్రల్ జోన్ ప్లానింగ్ కమిటీ చైర్మన్ ఎల్ఐసి అసోసియేషన్ నాయకులు అబ్దుల్ కరీంకు చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్లు, డెవలప్మెంట్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మిద్దెకూలిన బాధితులకు ఆర్థిక సాయం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పాములపాడు



ఎడతెరపి లేకుండా గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు బుధవారం మిట్ట కందల గ్రామంలో కూలిన మట్టి మిద్దెను ఆర్‌డిఒ దాస్ గురువారం పరిశీలించారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు పంపించి బాధితు లకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలో పర్యటించి శానిటేషన్ పను లను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంటన వీఆర్వో ముర్తుజా ఉన్నారు.

పిఎం కిసాన్ సమృద్ధి కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- కోరమండల్ జోనల్ మేనేజర్ ఎం గోవిందరావు

ప్రజాశక్తి - నందికొట్కూరు


మాట్లాడుతున్న కోరమండల్ జోనల్ మేనేజర్ ఎం గోవిందరావు

పిఎం కిసాన్ సమృది కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ జోనల్ మేనేజర్ గోవిందరావు తెలిపారు. గురువారం పట్టణంలోనే స్థానిక గ్రోమర్ న్యూట్రి క్లినిక్‌లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ సల్ఫర్ కోటెడ్ యూరియా ఎరువు లను ప్రధాని మోడీ అందుబాటులోకి తీసుకువచ్చా రన్నారు. కోరమాండల్ సంస్థ ప్రతినిధులు రాష్ట్రం లో ఏర్పాటుచేసిన 4200 పిఎంకెఎస్కే కేంద్రాలలో ప్రధాని ప్రసంగ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారాన్ని రైతుల కొరకు ప్రదర్శించామని తెలిపారు. అనంతరం వారు రైతులకు సుస్థిర వ్యవసాయం, సమగ్ర పోషక యజమాన్యం గురించి వివరించారు. పిఎం కిసాన్ సమృద్ధి కేంద్రాల ద్వారా భూసార పరీక్షలు, విస్తరణ సేవలను రైతుల సద్విని చేసుకో వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీలర్లు, న్యూట్రి క్లినిక్ ప్రతినిధులు ఉదయ్ కుమార్, ఎండి టి అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

ఆధునిక సాగు విధానాలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-డోన్

రైతులు పూలతోట సాగులో ఆధునిక సాగు విధానాలు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చు అని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ టి.సుశీల, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ సప్తశైల.సుమిత్రరాజేష్‌లు పేర్కొన్నారు. గురువారం డోన్ మండలంలోని ధర్మవరం గ్రామంలో రైతు భరోసా కేంద్రం నందు జిల్లా ఉద్యాన శాఖ అధికారి యు.నాగరాజు ఆధ్వర్యంలో పూల తోట సాగులో సమగ్ర సస్యరక్షణ రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ టి.సుశీల,డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ సప్తశైల. సుమిత్రరాజేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ టి.సుశీల మాట్లాడుతూ పూల సాగులో బంతి,మల్లె, చామంతి,లిల్లి,కనకాంబరాల లో నూతన వంగడాలు గురించి రైతులకు వివరించారు. పూలసాగులో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు, మార్కెట్‌కు కావలసిన నాణ్యత పరిమాణాలు మీద అవగాహన కల్పించారు. సప్తశైల.సుమిత్రరాజేష్ మాట్లాడుతూ పూలసాగులో కొత్త వంగడాలను సాగు చేసి పూలసాగు విస్తీర్ణాన్ని పెంచాలని కోరారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి యు.నాగరాజు మాట్లాడుతూ ఉద్యాన శాఖ అందిస్తున్న వివిధ రకాల పథకాల గురుంచి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డోన్ ఉద్యాన శాఖ అధికారి జి. కళ్యాణి,ధర్మారం సర్పంచ్ ఎల్లమ్మ,ఉప సర్పంచ్ లక్ష్మీదేవి,విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ శంకర్ హరి ప్రసాద్,వెంకట్ రాముడు మమత,ధర్మవరం, గోసానిపల్లె,కన్నపకుంట గ్రామ రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ సప్తశైల.సుమిత్రరాజేష్

నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించండి : చైర్మన్

ప్రజాశక్తి - బేతంచర్ల

పట్టణ అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర పంచాయతీ చైర్మెన్ సిహెచ్ చలం రెడ్డి కోరారు. బేతంచెర్ల నగర పంచాయతీకి అమృత్ 2.0 పథకం ద్వారా రూ.47.66 కోట్లు, 15వ ఆర్థిక సంఘం ప్రత్యేక నిధులు టైడ్ గ్రాంట్ నిధులు రూ.1,15,02,434 కోట్లు, అన్ టైడ్ గ్రాంట్ నిధులు రూ.76,68,272 లక్షలు మంజూరైనట్లు నగర పంచాయతీ చైర్మెన్ సిహెచ్ చలం రెడ్డి, కమిషనర్ ఎల్.రమేష్ బాబు తెలిపారు. గురువారం నాడు పంచాయతీ కార్యాల యం నందు నగర పంచాయతీ కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమృత్ పథకం ద్వారా మంజూరైన నిధులతో నగర పంచాయతీలో ప్రతి కాలనీలో నిర్మాణం త్వరలో చేపడుతామని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు 2022-23 మొదటి ఇన్స్టాల్మెంట్ గాను టైడ్ గ్రాండ్ కింద మంజూరైన రూ.1.15 కోట్ల నిధులను నగర పంచాయతీలో వాటర్ సప్లై కోసం ఉపయోగించు కున్నట్లు వారు తెలిపారు. అన్‌టైడ్ గ్రాంట్ కింద మంజూరైన మొదటి విడుతలో పట్టణంలోని ఆయా కాలనీలలో బీటీ రోడ్లు, సిసి రోడ్లు, డ్రైనేజ్ కాలువలు ఏర్పాటుకు రూ.76.68 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టను న్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అంజాద్‌బాష, వెంకటేష్ నాయక్, శ్రీదేవి, వైస్ కౌన్సి లర్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు కొమ్ము మధు, చింతల నాగిరెడ్డి,కోట్ల మధు, నాగజ్యోతి, బి ముబీ నా, రాంగోపాల్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పులులను కాపాడుకుందాం

ఫారెస్టు సెక్షన్ అధికారి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - రుద్రవరం

అడవులను సంరక్షించుకుని పులులను కాపాడుకుందామని రుద్రవరం ఫారెస్ట్ సెక్షన్ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రుద్రవరం సెక్షన్ పరిధిలోని రెడ్డిపల్లె, పందిర్లపల్లె, అప్పనపల్లె గ్రామాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వన్యప్రాణి సంరక్షణ ప్రాముఖ్యత, అటవీ ఆవరణ వ్యవస్థ సమతుల్యతలో పెద్ద పులి ప్రధాన పాత్ర వహిస్తుందన్నారు. పెద్ద పులికి హాని తలపెట్ట వద్దని, ఉచ్చులు పెట్టవద్దని స్థానిక ప్రజలకి తెలియజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు మాబు ఖాన్, సురేంద్ర గౌడ్, కూప్ మేస్త్రీలు నరసింహ, సాయి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే రుద్రవరం అటవీ రేంజి పరిధిలోని అహోబిలం గ్రామంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అహోబిలం డిప్యూటీ రేంజ్ అధికారి ముర్తుజావలి, బీట్ ఆఫీసర్లు విజయవర్ధన్, నాగ హుస్సేనయ్య, విద్యార్థులు పాల్గొన్నారు. **మహానంది** మండలం ఆర్ఎస్ గాజులపల్లి గ్రామంలోని ఎంపీయుపి స్కూల్ నందు సర్పంచ్ అస్లాం భాష అధ్యక్షతన అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చెలమ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు అడువులు, పులుల సంరక్షణ, వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ:** జాతీయ పులుల దినోత్సవం ఈ నెల 29ని పురస్కరించుకొని జిల్లా అటవీ శాఖ అధికారి వినీత్ కుమార్, రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు ఉత్తర్వుల మేరకు పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో పులులు వాటి ప్రాముఖ్యత, వాటి సంరక్షణ గురించి వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రంగనాయకులు, నూతల సెక్షన్ ఫారెస్ట్ బీట్ అధికారులు రామకృష్ణ, నాగేంద్రయ్య పాల్గొన్నారు. **చాగలమర్రి :** ప్రపంచ పులుల దినోత్సవ సందర్భంగా స్థానిక కేజీబీవీ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో గురువారం వ్యాసరచన క్విజ్ వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారి పెద్దన్న మాట్లాడుతూ జిల్లా అటవీ శాఖ అధికారి ఆదేశాల మేరకు రుద్రవరం అటవీ క్షేత్రాధికారి ఉత్తర్వుల మేరకు ఈనెల 29వ తేదీన ప్రపంచ పులుల దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీలలో గెలుపొ ందిన విద్యార్థినిలకు బహుమతులను అందజేశా మన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బిఓలు నాగేష్, సుభాష్, మదన గోపాల్, ప్రొటెక్షన్ వాచర్ నర్సయ్యలు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** పులి గురించి సమాజంలోని ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బండి ఆత్మకూరు రేంజర్ నాసిర్జా అన్నారు. ఈనెల 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మండలంలోని పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పార్నపల్లి ప్రభాస్ ఫార్మసీ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా రేంజర్ నాసిర్జా, ఎఫ్ఎస్ఓ రవీంద్ర నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు


పులుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఇందిరా ప్రియదర్శిని

వ్యక్తుల అక్రమ రవాణాను అరికట్టాలి

- సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని

ప్రజాశక్తి - నందికొట్కూరు

వ్యక్తుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని అన్నారు. ఈనెల 30వ తేదీన ప్రపంచ వ్యక్తుల అక్రమ రవాణాకు వ్యతిరేక దినోత్సవంపై మండల లీగల్ సర్వీస్ కమిటీ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని ఆధ్వర్యంలో గురువారం స్థానిక కోర్టు ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత తీవ్రమైన సమస్య అని, వ్యక్తుల అక్రమ రవాణాని అరికట్టాలని అన్నారు. కార్యక్రమంలో తాసిల్దార్ రాజశేఖర్ బాబు, మున్సిపల్ కమిషనర్ కిషోర్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భాస్కర్, ఐసిడిఎస్ కోటేశ్వరమ్మ, లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, మెప్మా శాంత కుమారి, బార్ అసోసియేషన్ సెక్రటరీ శరభయ్య, సోషల్ వర్కర్ శోభ రాణి, పారా లీగల్ వాలంటరీ సిరిగిరి అనిల్ కుమార్, బుల్లెద్దుల చిన్న రాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ బిల్లును ఆమోదించాలి

- బైరెడ్డి శబరికి ఎంఆర్‌పిఎస్ వినతిపత్రం

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఎస్‌సి వర్గీకరణ బిల్లును ఆమోదించాలని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నంద్యాల జిల్లా బిజెపి ఇన్చార్జ్ బైరెడ్డి శబరికి ఎంఆర్‌పిఎస్ నాయకులు వనతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ కోసం 29 సంవత్సరాలుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అలుపెరుగని పోరాటం చేస్తున్నామని బిజెపి ఎస్సీ వర్గీకరణ మద్దతు తెలపడంతో మద్దతు తెలిపామన్నారు. ఇప్పటికి 9 సంవత్సరంలు అవుతున్న ఎస్సీ వర్గీకరణ విషయంలో బిజెపి జాప్యం చేస్తోందని, ఇప్పటికైనా వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేష్,వెంకటేష్ స్వాములు, రమేష్, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంపెంట చెంచు కాలనీలో వర్షపు నీరు

- పర్యటించిన తహశీల్దార్, ఎంపీడీవో

ప్రజాశక్తి - పాములపాడు

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వేంపెంట చెంచుగూడెంలోకి వర్షపు నీరు ఇళ్లలోకి చేరాయి. గురువారం నాడు తాసిల్దార్ రత్న రాధిక, ఎంపీడీవో గోపికృష్ణ, ఈఓఆర్డి శ్రీనివాసులు నాయు డు చెంచు గూడెంను సందర్శించారు. వర్షపు నీరు బయటకు జెసిబి ద్వారా పంపించే చర్యలు చేపట్టారు. గిరిజనులకు ప్రభుత్వ పాఠశా లలో పునరావాసం ఏర్పాటు చేసి భోజనాలను పంపిణీ చేశారు. కుటుంబాలకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు.


పునరవాసం కేంద్రం ఏర్పాటు చేసి భోజనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం